క్లుప్తంగా

అంగన్‌వాడీలకు పురుగుల పప్పు



జగదేవ్‌పూర్(గజ్వేల్): అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం అందించాల్సి ఉండగా పురుగులు పట్టిన పప్పును సరఫరా చేస్తున్నారు. పప్పులో లక్క పురుగులు రావడంతో పాటు పుచ్చిపోయిందని అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు. దీంతో రెండు నెలల క్రితం వచ్చిన పప్పును కాకుండా పాత స్టాక్‌నే వాడుతున్నారు. కాంట్రాక్టర్‌కు చెప్పినా తీసుకువెళ్లడం లేదని, కేంద్రాల్లోనే నిల్వ చేయడం వల్ల పప్పు పూర్తిగా పురుగు పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో బాలింతలు, గర్భిణులు, పిల్లలు రోగాల రోగాల బారిన పడే అవకాశం ఉంది. వెంటనే అధికారులు స్పందించి నాణ్యమైన పప్పును సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టీహెచ్‌ఆర్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

నంగునూరు(సిద్దిపేట): ఎన్‌సీసీ, టీహెచ్‌ఆర్ సేన ఆధ్వర్యంలో నంగునూరులో నిర్వహిస్తున్న తన్నీరు హరీశ్‌రావు ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు టోర్నమెంట్ నిర్వహించడం హర్షనీయమని కొనియాడారు. కార్యక్రమంలో రమేశ్‌గౌడ్, రహీంపాష, చంద్రకళ, రవి, మహేందర్‌రెడ్డి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

12న రక్తదాన శిబిరం

చేర్యాల(సిద్దిపేట): స్వామి వివేకానంద జన్మదినం సందర్భంగా ఈనెల 12న కల్యాణి గార్డెన్‌లో వివేకానంద టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కార్యదర్శి బాల భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే టీచర్లకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. రక్తదానం చేయాలనుకునే వారు 9959525600, 9553239090 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వేతన సవరణ చర్చలు ప్రారంభించాలి



ఎల్‌ఐసీ ఆఫీస్ ఎదుట ఉద్యోగుల ధర్నా

హుస్నాబాద్: ఎల్‌ఐసీ యాజమాన్య ఏకపక్ష వైఖరిని నిరసిస్తూ ఎల్‌ఐసీ ఆఫీసర్స్, ఉద్యోగుల జాయింట్ ఫ్రంట్ ఐక్యత ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. నూతన పెన్షన్ స్కీం కవర్ అవుతున్న ఉద్యోగులకు యాజమాన్యం చెల్లించే కంట్రిబ్యూషన్ 10 నుంచి 14 శాతం వరకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రవీందర్, క్లాస్ వన్ ఆఫీసర్ రవీందర్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ చేపట్టొద్దు



అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

దుబ్బాకటౌన్: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ముస్తాబాద్ రోడ్డు మార్గంలో చేపట్టే రోడ్డు విస్తరణ పనులు రద్దు చేయాలని బాధిత కుటుంబాలు డిమాండ్ చేశాయి. బుధవారం రోడ్డు వెడల్పులో నష్టపోతున్న వారు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట అందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహం నుంచి 60 ఫీట్ల వరకు రోడ్డు విస్తరణ చేసేందుకు మార్కింగ్ చేశారని.. దీంతో తమ ఇళ్లు పూర్తిగా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు వెడల్పు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధితులు ఇస్తారిగల్ల చరణ్‌తేజ, బిల్ల చిన్నరాజం, గన్నె దయాకర్‌రెడ్డి, మరాటి బాబు, బుచ్చిరెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

గుంతల దారి.. కంకర తేలి!



అందె రోడ్డు దుస్థితి



మిరుదొడ్డి శివారులో కంకర తేలిన రోడ్డుపై వాహనదారుల ప్రయాణం

మిరుదొడ్డి(దుబ్బాక): కంకర తేలి ప్రమాదకరంగా మారిన రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. మండల కేంద్రమైన మిరుదొడ్డి- అందె వరకు నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణానికి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద సుమారు రూ.70 లక్షల నిధులు మంజూరయ్యాయి. గత పాలకులు, అధికారులు మారినా రోడ్డు నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని

ప్రమాదకరంగా మారిన రోడ్లు

ఇరుగ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 5 కిలోమీటర్ల మేర కంకర తేలడంతో వాహనదారులకు, ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారుతోందని మండిపడుతున్నారు. రోడ్డు దుస్థితి కారణంగా అందె మీదుగా గజ్వేల్, సికింద్రాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సు రద్దు కావడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే మిరుదొడ్డి నుంచి కాసులాబాద్, మోతె వరకు ఉన్న బీటీ రోడ్డు మరమ్మతులకు నోచుకోకవడంతో గుంతలమయంగా మారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా అక్బర్‌పేట- భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లి-వీరారెడ్డిపల్లి బీటీ రోడ్డుకు సుమారు రూ.40 లక్షలు, జంగపల్లి నుంచి మాదన్నపేట వరకు నిర్మించే రోడ్డుకు సుమారు రూ.1.40 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కాగా రోడ్ల నిర్మాణానికి టెండర్లు వేయకపోవడంతో రోడ్లకు మోక్షం లభించడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు వెంటనే స్పందించి మిరుదొడ్డి, అక్బర్‌పేట- భూంపల్లి మండల పరిధిలో నిధులు మంజూరైన రోడ్లకు మోక్షం లభించేలా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆస్పత్రి పాలయ్యాను



మిరుదొడ్డి నుంచి అందె గ్రామానికి వెళుతున్న క్రమంలో కంకర తేలిన రోడ్డుపై బైక్ అదుపు తప్పింది. కింద పడటంతో కంటికి తీవ్ర గాయమైంది. దీంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవడానికి సుమారు రూ. 80 వేలు ఖర్చయ్యాయి. గాయాలతో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాను. రోడ్డును నిర్మించి ప్రమాదాలను నివారించాలి.

– దయాకర్, మిరుదొడ్డి

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

గత అసెంబ్లీ ఎన్నికలతో రోడ్ల నిర్మాణ పనులు ఆగిపోయాయి. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో అనుమతులు లభిస్తే నిర్మాణ పనులు చేపడతాం. ఆయా రోడ్ల నిర్మాణాలకు మంజూరైన నిధులు, టెండర్ల ప్రతిపాదనను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తాం. త్వరలోనే రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడతాం.

– శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌ఏఈ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సమన్వయంతో పని చేయండి

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. బుధవారం చిన్నకోడూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మాణిక్యరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఏదైనా సమస్య ఉంటే అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొండం వనిత, పీఏసీఎస్ చైర్మన్లు కనకరాజు, సదానందంగౌడ్, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం రైతుబంధు, రైతు బీమా కొనసాగించాలని, రంగనాయక సాగర్‌లోకి నీటిని విడుదల చేయాలని, రూ. 2 లక్షల రుణ మాఫీ చేయాలని, రూ. 500 బోనస్ చెల్లించాలని, దళిత బంధు, బీసీ బంధు అమలు చేయాలని సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సిద్దిపేటజోన్: తెలంగాణ పంచాయతీరాజ్ ఎంప్లాయిస్ ఫోరం జిల్లా కార్యవర్గం నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఫోరం నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రాములోరి అక్షింతలు

నంగునూరు(సిద్దిపేట)/దుబ్బాకటౌన్/చిన్నకోడూరు: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని పూజిత అక్షింతలను బుధవారం నంగునూరు, నాగరాజుపల్లి గ్రామాల్లో ఇంటింటా తిరిగి పంపిణీ చేశారు. యువజన సంఘాలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి ఆలయ నమూనా చిత్రపటంతో పాటు అక్షింతలు అందజేశారు. అలాగే దుబ్బాక పట్టణంలోని 14వ వార్డులో కౌన్సిలర్ ఆస యాదగిరి ఆధ్వర్యంలో ఇంటింటా



నంగునూరు వేంకటేశ్వరాలయం నుంచి అక్షింతలను తీసుకెళ్తున్న భక్తులు

అక్షింతలు పంపిణీ చేశారు. చిన్నకోడూరు మండల పరిధిలోని అల్లీపూర్, గంగాపూర్, చిన్నకోడూరులో ఇంటింటా అక్షింతలను పంపిణీ చేశారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దుబ్బాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రూ. కోటి అవినీతికి పాల్పడిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని డబ్బులు రికవరీ చేయాలని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అనుచరుడు కైలాసం, సీఈఓ లక్ష్మారెడ్డిని కాపాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అలాగే నియోజకవర్గంలోని కొన్ని భూములు కబ్జాకు గురయ్యాయని.. వాటిని త్వరలోనే బయటపెడుతామని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, నాయకులు ఇస్తారిగల్ల మల్లేశం, కొంగరి రవి, నరేందర్‌రెడ్డి, నర్మెట్ట ఏసురెడ్డి, పర్శరాములు, కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఆర్థిక స్వావలంబనే ధ్యేయం

ములుగు(గజ్వేల్): మహిళా ఆర్థిక స్వావలంబనే 'రోటరీ ఇంటర్నేషనల్' ధ్యేయమని గజ్వేల్ క్లబ్ అధ్యక్షుడు కుక్కల బాబుగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని తున్కిబొల్లారంలో 'హెల్ప్ టు నీడీ' సహకారంతో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు స్వయం ఉపాధి కల్పిస్తూ ఆర్థిక స్వావలంభన సాధించేలా పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి మహిళ ఆర్థిక అభివృద్ధి సాధించినప్పుడే వారి కుటుంబం ప్రగతి సాధిస్తుందన్నారు. అనంతరం హెల్ప్ టు నీడీ సంస్థ వ్యవస్థాపకుడు సీఎస్ మహేష్‌రావు పంతులు మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మెంబర్ అట్రాక్షన్ చైర్మన్ కొడాలి చంటి, వాటర్, శానిటేషన్ చైర్మన్ కుంట కరుణాకర్‌రెడ్డి, పూర్వ అధ్యక్షులు జగదీశ్వర్, బాపురెడ్డి, సభ్యులు చిట్టిరెడ్డి, అశోక్, వెంకటేష్‌గౌడ్, అశోక్ రెడ్డి, మోహన్‌రెడ్డి, స్వరూపరెడ్డి పాల్గొన్నారు.



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

'మోడల్'లో సంక్రాంతి సందడి

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో బుధవారం ముందస్తు సంక్రాంతి సందడి మొదలైంది. విద్యార్థులు స్వతహాగా తయారు చేసిన గాలిపటాలతో సందడి చేశారు. డూడూ బసవన్నల ఆకృతులతో ఆడి పాడారు. అత్యుత్తమ కళాకృతులను తయారు చేసిన విద్యార్థులకు టీచర్లు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ భారతీదేవి మాట్లాడుతూ.. సంక్రాంతి విశిష్టతను తెలిపే విధంగా విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహిస్తూ బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. గురువారం విద్యార్థులతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



తయారు చేసిన గాలిపటాలతో విద్యార్థులు

జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతా



విరాహత్‌అలీతో నాయకులు, జర్నలిస్టులు

ములుగు(గజ్వేల్): టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరాహత్‌అలీకి బుధవారం సాయంత్రం మండలంలోని వంటిమామిడి వద్ద ములుగు, వర్గల్ మండలాల నాయకులు, జర్నలిస్టులు ఘనస్వాగతం పలికారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్‌రెడ్డి, బాపురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రసాద్‌గుప్తా, జర్నలిస్టు నాయకులు కృపాకర్‌రెడ్డి, జగదీశ్వర్, విజయ్‌రావు, పవన్, శ్రీనివాస్‌రెడ్డి, తాడెం నర్సింలు, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చేర్యాల(సిద్దిపేట): ప్రమాదవశాత్తు గాయపడిన బీఆర్‌ఎస్ నాయకుడు, మల్లన్న ఆలయ మాజీ చైర్మన్ ముస్త్యాల కిష్టయ్యను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. పట్టణ కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే కిష్టయ్య ఇంటికి వెళ్లి పరామర్శించి ప్రమాదం జరిగిన తీరు, ప్రస్తుత పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఇన్నారెడ్డి, చందు ఉన్నారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని అంతక్కపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం రోటరీక్లబ్, 1985–86 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ ఆధ్వర్యంలో బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులకు రోటరీ క్లబ్ అండగా నిలుస్తోందని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇర్రి లావణ్య, ఎంపీటీసీ సభ్యురాలు కంది రజిత, ఎంఈఓ నర్సింహారెడ్డి, రోటరీక్లబ్ సభ్యులు ఇంద్రసేనరెడ్డి, పాపారావు, రవీందర్, అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, ఉపసర్పంచ్ సమ్మయ్య, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: వాహనదారులు గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ తిరుపతి పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా సేయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ప్రజ్ఞాపూర్‌లోని రాజీవ్ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా రోడ్డు భద్రత, వాహనాలపై వెళ్లే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై నృత్యరూప ప్రదర్శన చేపట్టారు. అనంతరం ట్రాఫిక్ సీఐ తిరుపతి మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డుపై ప్రయాణించే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడడం, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం, అతివేగం, రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారముంటుందన్నారు. ఈసందర్భంగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఎస్‌ఐలు పర్శరాములు, యాదవరెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు, గ్రామస్తులు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బూర్గుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు సంపత్, జానకీరాంరెడ్డి బదిలీపై వెళ్తున్న సందర్భంగా బుధవారం వారికి వీడ్కోలు పలుకుతూ సత్కరించారు. ఈసందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయోధ్యలో అన్నప్రసాద వితరణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈనెల 22న అయోధ్యలోని రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి సభ్యులు నేతి కైలాసం, కుమ్మరికుంట రమేష్ తెలిపారు. అయోధ్యకు తరలివచ్చే భక్తులకు అన్నదానం అందించే విధంగా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ **ప్రజలకు అందుబాటులో ఉంటా..**

దుబ్బాకటౌన్: తాను ఓడిపోయినప్పటికీ నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానని మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్‌లో కంకణాల నవీన్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు బాలేష్‌గౌడ్, వంశీ, సుభాష్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **నివాళి**

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు కొమ్ము నర్సింగరావు తల్లి లక్ష్మి (78) బుధవారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిదులు, నాయకులు నర్సింగరావు ఇంటికి వెళ్లి లక్ష్మి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్, స్థానిక కౌన్సిలర్లు తదితరులు నివాళులర్పించారు.

◆ **క్రీడలతో మానసికోల్లాసం**



మద్దూరు(హుస్నాబాద్): క్రీడలు మానసికోల్లాసంతో పాటు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని మద్దూరు బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని గాగిల్లాపూర్‌లో డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణి, ఉపసర్పంచ్ మేక గోపాల్, మార్కెట్ డైరెక్టర్ ఉమామహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

◆ **గుంతలు పూడ్చివేత**



దుబ్బాకరూరల్: దుబ్బాక నుంచి హబ్సిపూర్‌కు వెళ్లే రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. ఇదే విషయాన్ని సాక్షి 'రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు' అనే వార్తను ప్రచురించింది. స్పందించిన సంబంధిత అధికారులు బుధవారం రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి వేయించారు.

◆ **మంత్రి 'పొన్నం'కు వినతి**

అక్కన్నపేట(హుస్నాబాద్): ఫిబ్రవరి 15వ తేదీ గిరిజనుల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ గోర్ సేన జిల్లా అధ్యక్షుడు అంగోతు రాజునాయక్ బుధవారం హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.



◆ **నేటి నుంచి ఉర్సు**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని నాయబ్ ప్రభు చిస్తీ ఆశ్రమ ట్రస్టు ముర్షద్ గడ్డలో 43వ ఉర్సే షరీఫ్ ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. గురువారం వేద జ్ఞానామృత ఖవ్వాలి, చందన, సుగంధముల సమర్పణ నిర్వహిస్తారు. శుక్రవారం దీపాలంకరణోత్సవం, భజన కార్యక్రమాలు.. శనివారం పవిత్ర ఖురాన్ పఠనం, వేదాంత హారతి, ఖవ్వాలి, నిర్వహించనున్నారు. పలు రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలిరానుండగా.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

◆ **కరపత్రాల ఆవిష్కరణ**

సిద్దిపేటకమాన్: గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ కోర్ కమిటీ సభ్యుడు శివరాజ్ డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 29న హైదరాబాద్‌లో పోరుగర్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కాశపాక రాజేందర్, నాయకులు వెంకటేశ్, కృష్ణ, పరుశరాములు, తదితరులు పాల్గొన్నారు.